

## క్రియాశీలకంగా పనిచేసిన ఉద్యమకారులను గుర్తించి ఇంటి స్థలం ఇవ్వాలి

సికింద్రాబాద్, డిసెంబర్ 31(వాయిస్ టుడే ప్రతినిధి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన ఉద్యమకారులను అందరినీ గుర్తించి, ఇంటి స్థలాలు ఇవ్వాలని ఉద్యమకారులు డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉద్యమకారుల సమావేశంలో పలువురు మాట్లాడుతూ 2008 నుంచి 2014 వరకు క్రియాశీలకంగా పనిచేసిన ప్రతి ఉద్యమకారుడిని ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై చర్చించేందుకు ఈ నెల 8న ఆర్ట్స్ కళాశాలలోని న్యూ సెమినార్ హాల్లో మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి నాటి ఉద్యమకారులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి నాటి ఉద్యమ నాయకులు డాక్టర్ పిడమర్తి రవి, కోట శ్రీనివాస్ గౌడ్, కంచర్ల బద్రి డాక్టర్ ఉపేందర్, కందుల శ్రీనివాస్, గుడిపల్లి రవి, నెమ్మది రవి, రాజేంద్రప్రసాద్, దర్శనం జాన్, ప్రేమ్, దుబ్బ రంజిత్, సురేశ్, రహీం, శిరీష్, పవనకుమార్, శ్రీకాంత్ గౌడ్, సుమన్, వెంకటేశ్, చంద్రశేఖర్రావు, ఓంకార్, వంశీ తదితరులు హాజరయ్యారు.



## ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

సికింద్రాబాద్, డిసెంబర్ 31(వాయిస్ టుడే ప్రతినిధి): గంజాయిని అక్రమంగా తరలిస్తూ, విక్రయిస్తున్న ఇద్దరిని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులతో కలిసి సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ బృందం పట్టుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలోని హబ్సిగూడలో గంజాయి విక్రయిస్తున్న కనుకుర్తి సాయినవీన్ అలియాస్ కుల్ఫీ (27)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 1.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడి నుంచి వచ్చిన సమాచారం ప్రకారం సాయినవీన్ కు చాట్ల వంశీ (19) గంజాయిని విక్రయించాడు. ఒడిశా నుంచి గంజాయిని తక్కువ ధరకు తీసుకువచ్చి అధిక లాభాలకు వంశీ విక్రయించేవాడు. పోలీసులు వంశీని అదుపులోకి తీసుకుని 900 గ్రాముల గంజాయి, ఒక ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే వివిధ పోలీస్ స్టేషన్, ఎక్సైజ్ స్టేషన్లలో సాయినవీన్ పై ఎన్డీపీఎస్, రెండు ఇతర కేసులు, వంశీపై ఒక ఎన్డీపీఎస్ కేసు, మూడు ఇతర కేసులు నమోదై ఉన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా లాలాపేట ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

సికింద్రాబాద్, డిసెంబర్ 31(వాయిస్ టుడే ప్రతినిధి): లాలాపేట ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ పదవీ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. లాలాపేటలోని నఫీజ్ గార్డెన్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం నూతన అధ్యక్షులుగా మడిపడగ శ్రీనివాస్గుప్త, ప్రధాన కార్యదర్శిగా పందిరి సాంబశివరావు, కోశాధికారిగా యెనిశెట్టి భాస్కర్లతో పాటు నూతన కమిటీ సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలెండర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణగుప్త హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవలో ఆర్యవైశ్యులు ముందు వరుసలో ఉంటారని చెప్పారు. 31 ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఆర్యవైశ్య సంఘం ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించిందని గుర్తు చేశారు. అనంతరం నూతన అధ్యక్షుడు మడిపడగ శ్రీనివాస్ గుప్త, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు నేతి రాములు గుప్త మాట్లాడుతూ సంఘంలో మూడు వేల కుటుంబాలు ఉన్నాయని పేర్కొన్నారు. సమాజంలోని ఆర్యవైశ్యులతో పాటు పేద ప్రజలకు తమ సేవలు అందిస్తున్నామన్నారు.

# అట్టహాసంగా ముగిసిన ధ్యాన మహాయాగం వేడుకలు

**వేడుకల్లో పాల్గొన్న ధ్యానులు**

**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

**ధ్యాన, ఆధ్యాత్మిక వేత్తలకు సత్కారం**



కడ్తాల్, డిసెంబరు 31: మండలంలోని అన్మాసపల్లి గ్రామ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్లో పత్రీజీ ధ్యాన మహాయాగం వేడుకలు ఆదివారం అట్టహాసంగా ముగిశాయి. ధ్యాన మహాయాగం వేడుకలు-2లో భాగంగా 11 రోజుల పాటు ధ్యాన సంబురాలు వైభవంగా నిర్వహించారు. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్మెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ధ్యాన, శాఖాహార జగత్తే లక్ష్యంగా నిర్వహించిన వేడుకల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్తో పాటు పలు రాష్ట్రాల నుంచి ధ్యానులు, సాధకులు, సందర్శకులు, పిరమిడ్ మాస్టర్లు హాజరయ్యారు. ముగింపు వేడుకల్లో పీఎసఎసఎం గ్లోబల్ వ్యవస్థాపకురాలు పరిమళ పత్రి, పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయ భాస్కర్రెడ్డిలు పాల్గొన్నారు. ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు ప్రాత:కాలం ధ్యానం నిర్వహించారు. అనంతరం ధ్యానులు పత్రీజీ శక్తి స్థల్ ను సందర్శించి ధ్యాన నివాళులర్పించారు. ఈసందర్భంగా పరిమళ పత్రీజీ, విజయభాస్కర్ రెడ్డిలు మాట్లాడుతూ నిత్య జీవితంలో ప్రతీ ఒక్కరు ధ్యానాన్ని అలవరుచుకొని ఆనందమయ జీవితాన్ని పొందాలన్నారు. ధ్యానం ద్వారా వినయ శీలత, సంకల్ప శక్తి సిద్ధించి ఒత్తిళ్ల నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. పత్రీజీ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయనపై అభిమానంతో లక్షలాది మంది ధ్యానులు హాజరై వేడుకలను విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. పలు ధ్యాన, ఆధ్యాత్మిక పుస్తకాలను పరిమళ పత్రీ, విజయభాస్కర్రెడ్డిలు ఆవిష్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అమితంగా ఆకట్టుకున్నాయి. పలువురు పిరమిడ్ మాస్టర్లు, ధ్యాన గురువులు, యోగులు, ఆధ్యాత్మికవేత్తల సందేశాలు ఆకట్టుకున్నాయి. ధ్యాన వేడుకల విజయవంతానికి సహకరించిన గురువులు, పిరమిడ్ ట్రస్టీ సభ్యులను విజయభాస్కర్రెడ్డి, పరిమళ, పరిణతి పత్రీలు సత్కరించి అభినందించారు. వేడుకలో పిరమిడ్ ట్రస్టీ సభ్యులు సాంబశివరావు, శివప్రసాద్రావు, దామోదర్రెడ్డి, మాధవి, నవకాంత్, హన్మంతరావు, శ్రీరామ్ గోపాల్, అన్మాసపల్లి సర్పంచ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## నేటి నుంచి నుమాయిష్..

## హైదరాబాద్లో ఫిబ్రవరి 15 వరకు ట్రాఫిక్ ఆంక్షలు

అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను ప్రారంభించనున్న సీఎం

46 రోజుల పాటు కొనసాగనున్న ఎగ్జిబిషన్

అబిడ్స్, డిసెంబర్ 31 : నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించే అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన సోమవారం నుంచి ప్రారంభం కానుంది. జనవరి 1న ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు, మంత్రి శ్రీధర్బాబుతో కలిసి ప్రారంభిస్తారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి కొనసాగుతూ వస్తున్న ఈ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన ప్రతి సంవత్సరం జనవరి 1వ తేది నుంచి ఫిబ్రవరి 15వ తేది వరకు 46 రోజుల పాటు కొనసాగుతుంది. ఈ యేడాది సోమవారం ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఎగ్జిబిషన్ సొసైటీ చేపట్టింది. దాదాపు 2400 స్టాళ్లను ఏర్పాటు చేయ నుండగా అమ్యూజ్మెంట్ పార్క్, ఫుడ్ కోర్టులు, వివిధ పారిశ్రామికవేత్తల ఉత్పత్తి అమ్మకాలు చేపట్టేందుకు స్టాళ్లను ఏర్పాటు చేస్తారు. నుమాయిష్కు వచ్చే సందర్శ కులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను చేపడుతున్నారు. పోలీస్, అగ్ని మాపక శాఖ అప్రమత్తంగా ఉండి నుమాయిష్ విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపడంతో పాటు మెట్రో రైలు వేళలను పొడిగించనున్నారు.

### సా. 4 నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

నేటి నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్లో 83వ ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ ప్రారంభమవుతుందని, ఈ నేపథ్యంలో నేటి నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి అర్ధరాత్రి వరకు పరిసరాలలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

**ట్రాఫిక్ మళ్లింపు:** సిద్దంబర్బజార్ వైపు నుంచి నాంపల్లి వైపునకు వెళ్లే ఆర్టీసీ జిల్లా బస్సులు, ప్రైవేట్ బస్సులు, ఇతర భారీ వాహనాలను మొహింజామార్కెట్ వద్ద అబిడ్స్ వైపు మళ్లిస్తారు. బషీర్బాగ్, కంట్రోల్ రూం వైపు నుంచి నాంపల్లికి వచ్చే వాహనాలను ఏఆర్ పెట్రోల్ బంక్ వద్ద బీజేఆర్ విగ్రహం, అబిడ్స్ వైపు మళ్లిస్తారు. బేగంబజార్, ఛత్రి నుంచి మలాకుంట వైపు వెళ్లే వాహనాలను అలస్క జంక్షన్ వద్ద దారుసలాం, ఏక్మినార్ వైపు మళ్లిస్తారు. దారుసలాం నుంచి అఫ్జల్గంజ్ వైపు వెళ్లే వాహనాలను అలస్క జంక్షన్ నుంచి బేగంబజార్, సిటీ కాలేజ్ వైపు మళ్లిస్తారు. మూసాబౌలి, బహదూర్పురా వైపు నుంచి నాంపల్లికి వెళ్లే వాహనాలను సిటీ కాలేజీ వద్ద నయాపూల్, ఎంజేమార్కెట్ రూట్లో మళ్లిస్తారు.

## నేర ప్రవృత్తిని వీడితే పాజిటివ్ షీట్

**రౌడీ షీటర్లు మారితే చక్కని భవిష్యత్తు**

**రాచకొండ సీపీ సుధీర్బాబు**



ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 31 : రౌడీషీటర్లలో మార్పు కోసం ఎల్బీనగర్లోని సీపీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్బాబు మాట్లాడుతూ.. రౌడీ షీటర్లు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మారాలన్నారు. రౌడీషీట్ ఉన్నవారు నూతన సంవత్సరం సందర్భంగా నేర ప్రవృత్తిని మార్చుకుని.. సమాజంలో సాధారణ పౌరులుగా నూతన జీవితం ప్రారంభించాలని సూచించారు. పిల్లలు తమ తల్లిదండ్రులను చూసి ఎదుగుతారన్నారు. రౌడీషీటర్లు నేర వృత్తిని వదిలి, పిల్లలు మంచిగా ఎదిగేలా, హుందాగా జీవించేలా, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకునేలా బాధ్యత వహించాలన్నారు. నేర ప్రవృత్తిని మార్చుకోవడానికి అవకాశమిస్తున్నామని, మార్పు రాకపోతే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. రౌడీషీట్ ఉన్న ప్రతి ఒక్కరిపై ప్రత్యేక నిఘా ఉంటుందని.. చట్ట వ్యతిరేక పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మార్పు కోసం ప్రయత్నించే వారికి సమాజ సేవ చేసే అవకాశం కూడా కల్పిస్తామన్నారు. మీ చుట్టూ జరిగే నేరాలపై సమాచారం అందించి.. సహకరించే వారికి, మార్పు వచ్చిన వారికి పాజిటివ్ షీట్ ఓపెన్ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డీసీపీ జానకీ ధారావత్, యాదాద్రి డీసీపీ రాజేశ్చంద్ర, ఎస్ఓటీ డీసీపీ గిరిధర్రావు, మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్, ఎస్వోటీ డీసీపీ మురళీధర్, ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## 3,4వ తేదీల్లో నీటి సరఫరా బంద్

సిటీబ్యూరో, డిసెంబర్ 31 : హైదరాబాద్ మహానగరానికి తాగునీటి సరఫరా చేస్తున్న కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లయి ఫేజ్-1లోని సంతోష్నగర్ వద్దనున్న 1600 ఎంఎం డయా ఎంఎస్ గ్రావిటీ మెయిన్ పైపులైన్కు జంక్షన్ పనులు చేపడుతున్నారు. ఎస్ఆర్డీపీ పనుల్లో భాగంగా నల్గొండ-ఓవైసీ డౌన్ర్యాంపు అలైన్మెంట్లో ఉన్న సంతోష్నగర్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనులకు ఇబ్బందులు పడకుండా ఈ జంక్షన్ పనులు చేయనున్నారు. ఈ పనులు ఈ నెల 3వ తేదీ బుధవారం ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు 4వ తేదీ గురువారం ఉదయం 6 గంటలకు వరకు జరుగుతాయని అధికారులు వెల్లడించారు. ఈ 24 గంటల పాటు పలు ప్రాంతాలలో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. మిరాలం, కిషన్బాగ్, అల్జుబైల్కాలనీ, సంతోష్నగర్, వినయ్నగర్, సైదాబాద్, చంచల్గూడ, అస్మాన్గఢ్, యాకుత్పుర, మాదన్నపేట్, మహబూబ్ మాన్షన్, రియాసత్నగర్, ఆలియాబాద్, బొగ్గులకుంట, అఫ్జల్గంజ్, నారాయణగూడ, అడిక్మెట్, శివంరోడ్, నల్లకుంట, చిలుకలగూడ, దిల్సుఖ్నగర్, బొంగుళూరు, మన్నెగూడ ప్రాంతాలలో నీటి సరఫరా ఉండదని, వినియోగదారులు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి అధికారులు విజ్ఞప్తి చేశారు.

# చెరగని ముద్ర..భవితకు భరోసా..

**2023లో ఎన్నో ప్రాజెక్టులు.. మరెన్నో మౌలిక వసతులు**

**కోకాపేట నియో పోలిస్ లే అవుట్ అభివృద్ధి**

**ఔటర్ వెంట అతిపెద్ద సోలార్ సైకిల్ ట్రాక్**

**మహానగరాభివృద్ధిలో హెచ్ఎండీఏ కీలక పాత్ర**



సిటీబ్యూరో, డిసెంబర్ 31 బీఅథారిటీ మహోన్నత పాత్ర పోషిస్తున్నది. ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణే లక్ష్యంగా ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ఒక్కొక్కటిగా చేపడుతూ.. నగరవాసులకు మెరుగైన సదుపాయాలను కల్పిస్తున్నది. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 2023లో నగర భవిష్యత్ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలా.. హెచ్ఎండీఏ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టులు.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులు వచ్చేందుకు దోహదం చేశాయి. ఐటీ రంగంలోనే కాకుండా రియల్ ఎస్టేట్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, డేటా సెంటర్స్ వంటి వాటిల్లో వేల కోట్ల పెట్టుబడులు నగరం చుట్టూ పక్కల ప్రాంతాల్లో వచ్చాయి. ముఖ్యంగా మహానగరానికి మణిహారంలా మారిన ఔటర్ చుట్టూ కీలక ప్రాజెక్టులను చేపట్టి.. అభివృద్ధికి కేంద్రంగా మార్చింది హెచ్ఎండీఏ.

### భారీ లే అవుట్..నియోపోలిస్

కోకాపేటలో నియోపోలిస్ (ఎస్ఈజెడ్-స్పెషల్ ఎకనామిక్ జోన్) పేరుతో భారీ లే అవుట్ను హెచ్ఎండీఏ అభివృద్ధి చేసింది. ఇది సుమారు 529.66 ఎకరాల్లో అభివృద్ధి చేసిన గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టుగా గుర్తింపు పొందింది. 150, 120 అడుగుల వెడల్పుతో విశాలమైన రోడ్లు, అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుళ్లు, మంచినీరు, డ్రైనేజీ లైన్లను అత్యాధునిక తరహాలో ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ. 300 కోట్లు వెచ్చించారు. ఇదే లే అవుట్లో ఎకరం స్థలానికి ధర రూ.100 కోట్లకు పైగా పలకడం దేశంలోనే సంచలనంగా మారింది. అదే విధంగా బుద్వేల్లో 180 ఎకరాల్లో లే అవుట్ అభివృద్ధి పనులను హెచ్ఎండీఏ చేపట్టగా, అవి పురోగతిలో ఉన్నాయి. శివారు ప్రాంతాల్లో అత్యంత కీలకమైన బాచుపల్లి, నిజాంపేట ప్రాంతాల్లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని సుమారు రూ. 173.42 కోట్ల వ్యయంతో ఈ పనులను హెచ్ఎండీఏ నిర్వహిస్తున్నది.

### శివార్లలో రోడ్ల విస్తరణ

నగరానికి ఉత్తర- పడమర దిక్కులను కలిపేలా రోడ్ల విస్తరణ చేపట్టాలని, అవసరమైన చోట ఫ్లై ఓవర్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో హెచ్ఎండీఏ ఒకేసారి మూడు పనులను చేపట్టింది. బాచుపల్లి నుంచి బౌరం పేట వరకు 4 లేన్ల రోడ్డు విస్తరణ, బాచుపల్లి జంక్షన్లో ఫ్లై ఓవర్ నిర్మాణం, బహదూర్పల్లి- కొంపల్లి మార్గంలో 4 లేన్లతో రోడ్డు విస్తరణ పనులు ప్రస్తుతం చురుగ్గా జరుగుతున్నాయి. సుమారు రూ.173.42 కోట్ల వ్యయంతో ఈ పనులను హెచ్ఎండీఏ నిర్వహిస్తున్నది. ఏకకాలంలో ఈ పనులన్నింటినీ పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించారు.

### పచ్చని అందాలతో లేక్వ్యూలు..

హుస్సేన్సాగర్ చుట్టూ ఉన్న తీర ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ముఖ్యంగా హైదరాబాద్-సికింద్రాబాద్ మధ్య వారధిగా ఉన్న ట్యాంక్ బండ్ సుందరీకరణ కోసమే సుమారు రూ.27 కోట్లు వెచ్చించారు. నెక్లెస్ రోడ్డులో రూ. లేక్వ్యూ పార్కును రూ.15 కోట్లతో సరికొత్త థీమ్తో నిర్మించారు. ఐటీ కారిడార్లో అత్యాధునికంగా అభివృద్ధి చేసిన గండిపేట లేక్ వ్యూ పార్కు ప్రత్యేకతను సంతరించుకున్నది. దీంతో పాటు ఓఆర్ఆర్ను అనుకొని హిమాయత్సాగర్ పక్కన ఉన్న కొత్వాల్గూడలో సుమారు రూ.300 కోట్లతో ఎకో పార్కు అభివృద్ధి పనులు ప్రస్తుతం పురోగతి ఉన్నాయి.

